ముందస్తు పరీక్షలతో..
వ్యాధులకు చెక్



కుమ్మరవీధిలో ఎన్‌సీడీ సర్వే చేస్తున్న ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి, ఆశ వర్కర్ పార్వతి

- ఇంటింటికీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- 18 ఏళ్లు నిండిన వారికి స్క్రీనింగ్ టెస్ట్‌లు
- నియోజకవర్గంలో చురుగ్గా సచివాలయ సిబ్బంది సర్వే


అల్లిపురం: ఆస్తులు వారసత్వంగా వస్తే సంతోషిస్తాం.. కానీ వ్యాధులు వంశపారంపర్యంగా వస్తే ఇదెక్కడి బాధ అని నిట్టూరుస్తాం. ఏ వ్యాధి కోసమైనా చికిత్స పొందేందుకు డాక్టర్ల వద్దకు వెళ్తే మీ ఇంట్లో ఎవరికైనా ఈ వ్యాధి ఉందా అని అడగటం పరిపాటి. వాటిలో ఎక్కువగా దీర్ఘకాలిక వ్యాధులు ప్రధానం. అవి ఎక్కువగా జన్యుకారకాలు, శారీరక, ప్రవర్తనా కారకాల వల్ల ఏర్పడతాయి. అలాంటి వ్యాధుల పట్ల గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్రమత్తమయింది. ప్రస్తుతం సచివాలయ ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ల ద్వారా ఇంటింటి సర్వే చేపట్టి దీర్ఘకాల వ్యాధులను గుర్తించి ఎన్‌సీడీ యాప్ ద్వారా నమోదు చేయిస్తున్నారు. వారికి ఒక ఐడీ క్రియేట్ చేస్తున్నారు. దీని వల్ల దేశంలో ఏ ఆస్పత్రికి వెళ్లినా వారి ఆధార్ కార్డు నంబర్ కొడితే వారి హిస్టరీ, వారికి గల వ్యాధులు, వంశపారంపర్యంగా సంక్రమించిన వ్యాధుల పట్ల వైద్యులకు అవగాహన కలుగుతుంది.

ఎన్‌సీడీ ద్వారా గుర్తించే వ్యాధులు..

- గుండెపోటు, హృదయ సంబంధ వ్యాధులు
- క్యాన్సర్లు
- ఆస్తమా, క్రానిక్ అబ్‌స్ట్రాక్టివ్ పల్మనరీ డీసీజ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు
- మధుమేహం
- మానసిక ఆరోగ్య పరిస్థితులు
- దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులు
- నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి

క్యాన్సర్ ప్రధానం..

ఈ పేరు వింటేనే ఎవరికైనా కాళ్లు చేతులు వణుకుతాయి. ప్రాణాంతకమైన క్యాన్సర్ మహమ్మారికి కళ్లెం వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. చాపకింద నీరులా విస్తరించే క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం వల్ల మరణాలు చోటు చేసుకుంటాయని వైద్యులు చెబుతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య శాఖ సర్వే, ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 2022లో 14.13 లక్షల క్యాన్సర్ కేసులు నమోదు కాగా వాటిలో 9.16 లక్షల మరణాలు సంభవించాయి. అవి 2023లో 14.96 లక్షలకు చేరుకున్నాయి. 2024లో ఇప్పటి వరకు సుమారు 3.10 లక్షల కేసులు నమోదయ్యాయి. ఇలాంటి ప్రమాదాన్ని ముందుగానే ఊహించి మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతి వార్డుకు ఒక హాస్పటల్ ఉండాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సచివాలయాలు ఏర్పాటు చేసి ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో సమగ్ర సర్వేకు ఒక యాప్‌ని రూపొందించారు. ఆ యాప్ ద్వారా గత ఏడాది నుంచి ఈ సర్వే మొదలు పెట్టారు.



ఎన్‌సీడీ 3.0 యాప్

ప్రత్యేక యాప్‌లో నమోదు..

ఎన్‌సీడీ సర్వేకు ఉపయోగకరంగా ఒక ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించారు. పరీక్షలకు సంబంధించిన వ్యక్తుల వివరాలను అందులో నమోదు చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా కొబ్బరితోట, భీమ్‌నగర్, భానోజీనగర్ పీహెచ్‌సీల ద్వారా వైద్యాధికారుల పర్యవేక్షణలో, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరి అనారోగ్య సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారి ఆహారపు అలవాట్లు తెలుసుకుంటున్నారు. అంతే కాకుండా యాప్‌లో పొందుపరిచిన పలు రకాలకు సంబంధించిన విషయాలను నమోదు చేస్తున్నారు. కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి పరీక్షలు చేసి, 30 సంవత్సరాలు నిండిన మహిళలకు అనారోగ్య సమస్యలు, నెలసరి వివరాలు, దంతక్షయాలు, మహిళల్లో గర్భాశయ ముఖద్వారం, రొమ్ము క్యాన్సర్ వంటి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని నమోదు చేయడంతో వ్యాధి ప్రాథమిక దశను అంచనా వేస్తారు. వీటితో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

రోజుకు 5 ఇళ్ల చొప్పున సర్వే..

భీమ్‌నగర్, కొబ్బరితోట, భానోజీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల సచివాలయాల ద్వారా ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ల ద్వారా రోజుకి 5 ఇళ్ల చొప్పున అన్ని సచివాలయాల్లో సర్వే చేయిస్తున్నాం. అవసరమైన వారికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో ముందస్తు క్యాన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. దానికి చికిత్స అందించవచ్చు. తద్వారా క్యాన్సర్ మరణాలను తగ్గించవచ్చు.

– డాక్టర్ నిఖిల్, వైద్యాధికారి, భీమ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.

శిక్షణ ఇచ్చిన సిబ్బందితోనే..

యాప్‌పై ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లకు శిక్షణ అందించాం. పరీక్షల సమాచారాన్ని యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నాం. క్యాన్సర్ వ్యాధి నివారణ పరీక్షలకు అందరూ సహకరించాలి. కొబ్బరితోట పరిధిలో సుమారు 3 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. మహిళలు ఎక్కువగా గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ సర్వే 9 నెలల పాటు కొనసాగుతుంది.

– అఖ్తాపర్వీన్, వైద్యాధికారి, కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇంటింటికీ వచ్చి సర్వే చేస్తున్నారు



ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు ఇంటింటికీ వచ్చి సర్వే చేస్తున్నారు. ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు అడిగి నమోదు చేసుకుంటున్నారు. కుటుంబంలోని సభ్యులందరి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. అందుకు మాకు ఒక ఐడీ కూడా ఇస్తున్నారు. ఆ ఐడీ వల్ల పూర్తి సమాచారం తెలుసుకునే వీలు కలుగుతుంది. అదంతా కంప్యూటర్‌లో భద్రంగా ఉంటుంది. మంచి కార్యక్రమమే చేపట్టారు.

– పట్నాల రమణమ్మ, నేరెళ్లకోనేరు

భగవద్గీత పఠన పోటీల్లో ఉత్తమ ప్రతిభ



మెరిట్ సర్టిఫికెట్ అందుకుంటున్న శృతి

మహారాణిపేట: గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పలు పోటీల్లో గాయిత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీబీ పాఠశాల విద్యార్థిని నగదు అవార్డులు అందుకుని సత్తా చాటింది. ఆదివారం వన్‌టౌన్ ఏరియాలో ఉన్న గీతా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 8వ తరగతి చదువుతున్న ఎన్.శృతి ఉత్తమ విద్యార్థినిగా ఎంపికైంది. ఇటీవల గీతా ప్రచార సమితి భగవద్గీత పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో విజేతలకు సమితి అధ్యక్షుడు వై.జగన్‌మోహన్‌రావు, విశ్వేశ్వరరావు, శ్రీ గాయిత్రి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు నగదు పురస్కారాలు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం: ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి ద్వారకాబస్‌స్టేషన్ ఇన్‌గేట్ దరి సులభ్ కాంప్లెక్స్ వద్ద విజయనగరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డు దాటుతున్న సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తిని ఢీకొంది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీలక్ష్మి అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు మాసిన గడ్డం కలిగివున్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796041 నంబరులో తెలియజేయాలని కోరారు.

క్లుప్తంగా

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మహారాణిపేట: పూర్వ విద్యార్థులు సందడి చేశారు. దాదాపు 39 సంవత్సరాల తర్వాత ఆదివారం అంతా ఒకే దగ్గర కలిశారు. 1985 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ కొరువాడ హైస్కూలు (కె.కోటపాడు మండలం) పూర్వ విద్యార్థులు ఏఎంసీ గ్రౌండ్‌లో కలుసుకున్నారు. మిత్రులంతా ఒకే దగ్గర చేరడంతో ఒకరిని ఒకరు పలకరించుకున్నారు. ఇన్నేళ్ల తర్వాత కలుసుకోవడంతో వారంతా ఆనందంగా గడిపారు. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

నేడు జీవీఎంసీలో పీజీఆర్‌ఎస్

డాబాగార్డెన్స్: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలవరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

మోహనరావు మాస్టారుకు పురస్కారం



తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు కొండపేటకు చెందిన ఉపాధ్యాయుడు గంటాన మోహనరావుకు హైదరాబాద్‌కు చెందిన ద సి కనెక్ట్స్ సంస్థ 'గ్రోత్ స్టోరీస్ సమ్మిట్' అవార్డును జీవిత సాఫల్య పురస్కారం–2024 కింద అందించింది. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈయన రచించిన 'స్పీక్ ఇంగ్లిష్ ఏజ్ ఇంగ్లిష్' 'ది బుక్ ఆఫ్ ఇంగ్లిష్ సినోనిమ్స్' పుస్తకాలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఎంతగానో దోహదపడ్డాయి. నగరంలోని దండుబజార్ జీవీఎంసీ ఎంవీడీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మోహనరావు మాస్టారు 2009లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

వృద్ధులకు అన్నదానం

సీతంపేట : వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ విభాగం మహిళా అధ్యక్షురాలు పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కయ్యపాలెంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్నం భోజనం అందజేశారు. స్వయంగా భోజనం వడ్డించి పండ్లు అందజేశారు. అలాగే 14వ వార్డు పరిధి పాపా హోమ్‌లో, 49వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో గల వానప్రస్థ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పులకింత



కనకమహాలక్ష్మి ఆలయం వద్ద భక్తుల సందడి

- కనకమహాలక్ష్మి సన్నిధికి భక్తుల జాతర
- కొండగుడి పండగకు క్యూ కట్టిన విశ్వాసులు
- కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న భక్తజనులు

డాబాగార్డెన్స్: నియోజకవర్గం అంతా ఆధ్యాత్మికంగా వెల్లివిరుస్తోంది. పురాతన దేవాలయాలకు నాందిగా నిలుస్తోంది. హిందూ.. క్రిస్టియన్.. ముస్లింలకు చెందిన పురాతన దేవాలయాలు.. చర్చిలు.. మసీదులు ఇక్కడే ఉన్నాయి. ఏ పండగ వచ్చినా కులమతాలకు అతీతంగా అందరూ ఒక్కటై సేవలందిస్తుంటారు. ఇదిలా ఉండగా.. ఆదివారం నియోజకవర్గమంతా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. మార్గశిరమాసం తొలి ఆదివారం కావడంతో కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలిరాగా.. విశాఖ పురి మేరీమాత (కన్నె మరియమ్మ) పండగకు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచే కాక ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అలాగే కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మార్గశిర ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆధ్యాత్మికత సంతరించుకుంది.

అన్ని దేవాలయాలను దర్శించుకున్న భక్తులు..

కొండగుడి పండగకు వచ్చే భక్తులు విశాఖ పురి మేరీమాతను దర్శించుకుని సిరులతల్లి కనకమహాలక్ష్మి దర్శనానికి విచ్చేసారు. సమయానుకూలంగా సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

అంతా గందరగోళమే.

ఆదివారం కావడంతో కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి, కన్నె మరియమ్మ ఉత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో నియోజకవర్గంలో ట్రాఫిక్ అంతా గందరగోళంగా తయారయింది.

అలరించిన హాస్య వల్లరి



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట : విశాఖ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం హాస్యవల్లరి పేరిట ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ ఆద్యంతం నవ్వులు పూయించాయి. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రావి గోపీకృష్ణ, ఎస్.ఎస్.రామానుజం నేతృత్వంలో క్లబ్ కళాకారులు భానుప్రకాష్, ఆర్ఎస్ఎన్ మూర్తి, డీఎస్ఎన్ మూర్తి, నాగ గణేష్, శివజ్యోతి ప్రదర్శించిన స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో సినిమా టిక్కెట్లు, మీరు చాలా అందంగా ఉన్నారు, కేసు గెలిచా, షాపింగ్‌మాల్ అమ్మ, తాగుబోతు బిచ్చగాడు, గండభేరుండం తదితర స్కిట్స్ ప్రేక్షకులను అలరించి చక్కటి హాస్యాన్ని పండించాయి. ఇటీవల కీర్తిశేషులైన బాదంగీర్ సాయి, చింతా ప్రభాకర్ ఆత్మలు శాంతించాలని క్లబ్ సభ్యులు మౌనం పాటించారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



విశేష పూజలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాలు 7వ రోజు ఆదివారం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు జరిపారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు సర్వదర్శనం, 6 నుంచి రాత్రి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ జరిపారు. త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు మార్గశిర గురువారాల్లో రూ.7,500, గురువారం మినహా మిగిలిన రోజుల్లో రూ.2,500 చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఈవో శోభారాణి తెలిపారు.

మండపంలో వైదిక కార్యక్రమాలు..

ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీచక్రనవావర్ణార్చన, లక్ష్మీహోమం, మార్గశిర మాస విశేష కుంకుమార్చన, అష్టోత్తర కుంకుమార్చనలు, వేద పారాయణ, సప్తశతీ పారాయణ, మహా విద్యాపారాయణ భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మార్గశిర మాస విశేష కుంకుమార్చనలు చేశారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వేదపారాయణ, మహా విద్యాపారాయణ జరిపారు. మధ్యాహ్న వందలాది మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సంస్థపై చర్యలు తీసుకోవాలని వినతి



వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు

అల్లిపురం: తనను మోసం చేసిన ఎంటీవీ, ఎంఏబీ (మిషన్ అహం బ్రహ్మాస్మి) సంస్థపై చర్యలు తీసుకుని, అక్కడ బందీలుగా ఉన్నవారిని రక్షించాలని కొమ్మాదికి చెందిన గోపిశెట్టి ప్రవీణ్ కోరారు. ఈ మేరకు డాబాగార్డెన్స్‌లో గల వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 2014లో జ్యోతి ఏజెన్సీలో పని చేస్తున్న తాను ఆశీల్‌మెట్ట దరి వేమన మందిరంలో మిషన్ అహం బ్రహ్మాస్మి సంస్థ సమావేశానికి వెళ్లినట్లు తెలిపారు. అప్పుడే వారి విషపు కోరల్లో చిక్కుకోవడంతో తన జీవితం నాశనం అయిపోయిందని తెలిపారు. తన ఆస్తిని దోచుకున్నారని, తన భార్యాపిల్లల జీవితాలను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య తనపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, కోర్టులో కేసులు వేసిందన్నారు. తారా విశాల్, సహస్ర అలియాస్ స్వప్న ఆశ్రమాన్ని పీఎంపాలెం నుంచి హైదరాబాద్‌కు మార్చేసి తన ఆస్తులు అమ్మించి తనను పూర్తిగా వారి వశం చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనలా చాలా మంది ఆశ్రమంలో చిక్కుకుని బాధపడుతున్నారని, వారిని కూడా రక్షించాలని పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలి



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు

మహారాణిపేట: రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పరిష్కారానికి సహకారం అందించాలని ఏపీఆర్‌ఎస్‌ఏ అసోసియేషన్ అధ్యక్షుడు, అమరావతి జేఏసీ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి అనేక విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అమరావతి జేఏసీ చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ నగర అధ్యక్షుడు యోగి, ఇతర సంఘాల నాయకులు కె.ఎస్.రావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



భద్రీనాథ్‌కు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో రాంబాబు



ఫణిరాజుకు ప్రసాదం అందజేస్తున్న ఏఈవో

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎన్‌సీఎల్‌టీ (హైదరాబాద్) జ్యూడీషియల్ గౌరవ సభ్యుడు ఎస్‌వీ భద్రీనాథ్, ఆదాయ పన్ను శాఖ కమిషనర్ (హైదరాబాద్) ఎస్.ఫణిరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. వేద ఆశీర్వచనం అనంతరం వారికి ఆలయ ఏఈవో వెంపలి రాంబాబు అమ్మవారి ప్రసాదం అందజేశారు.

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

సీతమ్మధార: ఎస్‌ఏడీలో 36 మంది కార్మికులను సస్పెండ్ చేసి, ఆరుగురిపై పోలీస్ కేసు పెట్టిన మేనేజ్‌మెంట్ ఏకపక్ష చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బి. గంగారావు అన్నారు. ఆదివారం ఉదయం ఎస్‌ఏడీసీఈ యూనియన్ దీక్షా శిబిరం నుండి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో గంగారావు మాట్లాడారు. విశాఖ చరిత్రలో ఏ పరిశ్రమలోనూ ఇంత మందిని సస్పెండ్ చేయలేదని చెప్పారు. ఎస్‌ఏడీ మేనేజ్‌మెంట్ సస్పెన్షన్లు, పోలీస్ కేసు ఎత్తివేసి, కార్మికుల కష్టార్జితం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విశాఖలో ఉన్న ట్రేడ్ యూనియన్లతో పాటు రాజకీయ పార్టీలను ఐక్యం చేసి పోరాడుతామన్నారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి. కుమార్ మాట్లాడుతూ సస్పెన్షన్లు రద్దు చేయాలని రక్షణ మంత్రికి మెయిల్స్ పంపిస్తామని చెప్పారు. పబ్లిక్ రంగ సంస్థల సమన్వయ కమిటీ కన్వీనర్ కుమార మంగళం, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కె. నాగార్జున, అరుణ్ శ్రీనివాసరావు, ఎంఈఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దీన్ అహ్మద్, జేసీఎం సభ్యులు భాను, శేఖర్ ఎస్‌ఏడీ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్‌లైన్‌కు బాలిక అప్పగింత



బాలికతో షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి

సీతమ్మధార: వన్‌టౌన్ ఏరియాలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ దగ్గర రెండు రోజుల నుండి హాసిని (7) ఒంటరిగా కూర్చుని ఏడుస్తూ ఉంటే పెట్రోల్ బంక్ సిబ్బంది ద్వారకా నగర్‌లోని ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్‌కు సమాచారం అందించారు. దీంతో షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి అక్కడికి వెళ్లి బాలికను కలుసుకున్నారు. తిండి లేక నీరసించిపోయిన పాపకు మంచినీరు, అల్పాహారం అందించారు. అనంతరం టీఎస్సార్ మహిళా షెల్టర్ హోంకు ఆదివారం తీసుకొచ్చారు. బాలిక అమ్మ చనిపోయిందని, తండ్రి చెత్త ఏరుకుని వచ్చిన డబ్బులతో బాగా తాగి తనను కొడుతున్నాడని పాప తెలిపింది. రాత్రి ఒంటరిగా వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయాడని చెప్పింది. పాప తదుపరి సంరక్షణ కోసం 1098కి ఫోన్ చేసి చైల్డ్‌లైన్ సిబ్బంది ప్రశాంత్‌కు అప్పగించారు.

మొదలైన క్రిస్మస్ సందడి



ఆకట్టుకుంటున్న శాంతాక్లాజ్ బొమ్మలు

జగదాంబ: పూర్ణామార్కెట్‌లో క్రిస్మస్ సందడి మొదలైంది. డిసెంబర్ 25న జరిగే వేడుక కోసం మార్కెట్‌లో దుకాణాలన్నీ రకరకాల స్టార్లు, ట్రీలతో కళకళలాడుతున్నాయి. శాంతాక్లాజ్ బొమ్మలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. క్రిస్మస్ ఇంకా పదిహేను రోజులకు పైనే ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే అమ్మకాలు జోరందుకున్నాయి. కొన్ని చర్చిల్లో ముందుగా మేరీ క్రిస్మస్ వేడుకలు చేసుకోవడంతో స్టార్లు, శాంతాక్లాజ్ బొమ్మల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే వస్త్ర దుకాణాలు కూడా ఊపందుకున్నాయి. జనవరిలో జరిగే వరుస పండగలు, ముందుగా వచ్చే క్రిస్మస్ నేపథ్యంలో మార్కెట్ కిక్కిరిసిపోతోంది. ఇదిలా ఉంటే వన్‌టౌన్‌లోని చర్చిలు కూడా ముస్తాబు చేస్తున్నారు. కొన్ని చర్చిల్లో ముందుగానే క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్నారు.